వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్...

అంబర్‌పేట్: అంబర్‌పేట మహంకాళీ ఆలయ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవం గురువారం అంగ రంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రో చ్ఛరణల నడుమ భారీ ధ్వజస్తంభ పుణ ప్రతిష్ఠ కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధల నడుమ కొనసా గింది. 48 అడుగుల భారీ ధ్వజస్తంభాన్ని భారీ క్రేన్ సాయంతో ప్రతిష్ఠించారు. తెల్లవారుజాము నుంచే వేదపండితులు ప్రత్యేక యాగం నిర్వహించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి నవధాన్యాలను భక్తులతో ధ్వజ స్తంభ పునాదిలో వేయించారు. వందలాది మంది భక్తుల సహకారంతో భారీ ధ్వజస్తంభా పునఃప్రతిష్ఠ ప్రక్రియ పూర్తి చేశారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కార్పొరేటర్లు బి.పద్మావెంకట్ రెడ్డి, విజయకుమార్‌గౌడ్‌లు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు కె.దుర్గప్రసాద్‌రెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, రంగంపల్లి రాజు, మల్లికార్జున్‌గౌడ్, చంగలి సుధాకర్, కిశోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్ పర్యవేక్షించారు.

విద్యా రంగానికి కొరవడిన ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఓయూ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్‌రావు

ముషీరాబాద్: విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో విద్యా రంగ సమస్యలు–నూతన ప్రభుత్వం అంశం పై గురువారం హైదరాబాద్ పీడీఎస్‌యూ అధ్యక్షుడు గడ్డం శ్యామ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు ప్రసంగించారు. చైనా, రష్యా దేశాలు విద్యను మానవ వనరులను ఉత్పత్తి చేసే కేంద్రాలుగా చూస్తుంటే మన దేశంలోని ప్రభుత్వాలు విద్య తాత్విక దృక్పథాలు విస్మరించాయన్నారు. దీంతో విద్యకు అనాది నుంచి పాలక వర్గ పార్టీలు సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తూ విద్యా కార్పొరేటీకరణను, ప్రైవేటీకరణను ప్రోత్సహించారని తెలిపారు. టీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధేశ్వర్ మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు తమ ఓట్ల శాతంలో విద్యార్థులను లెక్కిస్తు విద్యా రంగాన్ని చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ఓయూ రిసర్చ్ స్కాలర్ ఆజాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు లెనిన్, ఏఐడీఎస్‌వో నాయకులు నితీష్, చార్వాక తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, గౌతమ్, ఆసిఫ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ముందంజ



ప్రయోగాలను తిలకిస్తున్న చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు

ముషీరాబాద్: భారతదేశం శాస్త్రసాంకేతిక రంగాల్లో దూసుకుపోతుందని ఈ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాంనగర్‌లోని రెడ్ కాన్వెంట్ హై స్కూల్‌లో జాతీయ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫెయిర్ జరిగింది. ముఖ్య అతిథులుగా శ్రీనివాస్‌తో పాటు ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి చిరంజీవి, ఓయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అంతరిక్ష పరిశోధన యానం, గ్రీన్ హౌజ్, సోలార్ విద్యుత్ వంటి ప్రయోగాలతో పాటు మరో ఎన్నో ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. వంద మంది విద్యార్థులు ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కటకం రఘు, ప్రిన్సిపాల్ కె.సౌజన్య తెలిపారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం అన్నారు. గురువారం మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో రాంనగర్‌లోని జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీధరుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.హేమంత్‌కుమార్, వాకర్స్ క్లబ్ సెక్రటరీ అల్లాడి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లబస్తీలో రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు, తాళ్లబస్తీ కమిటీ నాయకులు

కవాడిగూడ: దోమలగూడ తాళ్లబస్తీలో డ్రైనేజీ పైప్ లైన్‌ల నిర్మాణం మాటున ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని దోమలగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ డిమాండ్ చేశారు. వాటర్‌వర్క్స్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ గురువారం కవాడిగూడ డివిజన్ బీజేపీ, దోమలగూడ తాళ్లబస్తీ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ఎల్‌ఐసీ వద్ద దోమలగూడ వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... ఇష్టానుసారంగా రోడ్ల తవ్వడంతో పాటు డ్రైనేజీ పైప్‌లైన్ ప్రతి ఇంటికీ కలపడానికి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... అక్రమంగా డబ్బులు వసూలు చేశారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బస్తీలో ఇంటింటికీ వెళ్లి విచారణ చేసి స్థానికులకు న్యాయం చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సి.మహేందర్ బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, దోమలగూడ తాళ్లబస్తీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సి.హెచ్. శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్, బీజేపీ నేతలు భువనగిరి చంద్రశేఖర్, ముదుగుల సురేష్ ముదిరాజ్, బస్తీ నేతలు వై. శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సమస్యలు పరిష్కరిస్తా



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. గురువారం డివిజన్‌లోని ఎల్లయ్యబస్తీలో ఆమె అధికారులతో కలసి పర్యటించారు. బస్తీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ... వాటర్ వార్క్స్, సీవారేజీ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డికి సమస్యలను వివరించామని ఆయన స్పందించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల నిర్మాణానికి రూ. 87 లక్షల నిధులను మంజూరు చేసారన్నారు. త్వరలోనే పైప్‌లైన్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. నాయకులు ఎ.వినయ్‌కుమార్, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

- రూ. 3.60 కోట్లతో 1000 ఎంఎం డయా పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం
- మురుగు సమస్యకు త్వరలో చెక్
- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్ ప్రధాన రోడ్డుపై పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో మెట్రో రైలు స్టేషన్ కింది భాగంలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 1000 ఎంఎం డయా మంచి నీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అర కిలో మీటరు వరకు ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. గురువారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రూ. 3.60 కోట్ల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ డివిజన్ కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం మోహన్‌రాజులతో కలిసి ప్రారంభించారు.

- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో మంచి నీటి లీకేజీల వల్ల రోడ్డు అధ్వానంగా మారడంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. 15 రోజుల్లో పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం అన్నారు.
- నిర్మాణ పనుల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానికంగా ఉన్న మహంకాళీ దేవాలయం, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.
- కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, గౌరీశంకర్ ఆలయ కమిటి చైర్మన్ శ్రీధర్‌చారి, మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు శంకర్‌గౌడ్, పూస గోరక్‌నాథ్, వెంకటేష్, సాయి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్పొరేటర్ల దుష్ప్రచారం...

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని బీజేపీ కార్పొరేటర్లు ప్రజలను మభ్యపెడుతున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీజేపీ కార్పొరేటర్ల అభివృద్ధి పనులపై చేస్తున్న ప్రచారంపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం ఒక బోరింగ్ వేసి ఆర్భాటం చేస్తున్న బీజేపీ నాయకులు కోట్లాది రూపాయలను మంజూరు చేయించి అనేక జటిలమైన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. తాము చేసిన పనినే చెప్పుకుంటాం తప్ప తాము చేయని పనులను ఏనాడు చెప్పుకోమని అన్నారు. అలాంటి చిల్లర రాజకీయాలు తమకు లేవని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు స్పెషల్ బడ్జెట్‌ను విడుదల చేయిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా బీజేపీ కార్పొరేటర్లు అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ముఠా గోపాల్ అన్నారు.

8న మహా శివరాత్రి మహోత్సవం

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో మార్చి 8న మహా శివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సాయి బాబా సంస్థాన్ పాలకమండలి ప్రతినిధులు గురువారం తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉండే భక్తుల సౌకర్యార్థం రాత్రి మొత్తం ఆలయం తెరిచే ఉంటుందన్నారు. ఏకాదశ రుద్రాభిషేకంలో పాల్గొనే భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అభిషేకంలో పాల్గొనే భక్తులు అందుకు అవసరమైన పూజా సామగ్రిని తెచ్చుకోవాలని సూచించారు. పవిత్రమైన శివరాత్రి పర్వదినాన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

నియామకం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: తెలంగాణ దళిత సిల్ట్ వెహికిల్స్ యూనియన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన భాష పాక శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయనను గురువారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సత్కరించారు. భవిష్యత్తులో సిల్ట్ వెహికిల్స్ యజమానుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

కార్మిక శాఖలో బదిలీలు సరికాదు: సీఐటీయూ

చిక్కడపల్లి: లోక్‌సభ ఎన్నికల పేరుతో కార్మిక శాఖలో బదిలీలు చేపడ్డం సరికాదని సీఐటీయూ నేత రాజయ్య అన్నారు. గురువారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 27వ తేదీన ఎన్నికల కమిషన్ ఇచ్చిన అర్డర్ ప్రకారం కార్మిక శాఖలో డీసీఎల్, ఏఎల్‌ఓల బదిలీలను నిలిపివేసి ఏసీఎల్‌లను బదిలీ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన బదిలీల ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన కోరారు.

శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు



ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డిని ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. విలేకరుల సంక్షేమం కోసం శ్రీనివాస్‌రెడ్డి ఒక యూనియన్ నాయకుడిగా సేవ చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

3న బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర స్థాయి సదస్సు

అంబర్‌పేట్: మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడాన్ని పురస్కరించుకొని మార్చి 3వ తేదీన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ జమలాపురపు శ్రీనివాస్ తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించే ఈ సదస్సుకు రాష్ట్ర శాసనసభ వ్యవహారాల, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్, వివిధ అధికారులు, మేధావులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు విచ్చేస్తారని చెప్పారు. ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలు పేద బ్రాహ్మణులకు అందేలా చూడాలని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలియజేశారు. సంఘం ప్రతినిధులు పాలకుర్తి శేషగిరిరావు, సామిరాజు, లక్ష్మీనారాయణ, రాపాక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎంగా మోదీ హ్యాట్రిక్ ఖాయం: గౌతంరావు



డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: నరేంద్రమోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు ఆశాభావం వ్యక్తం చేశారు. విజయ సంకల్ప యాత్రతో బీజేపీ ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను గుర్తించామన్నారు. గురువారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... వచ్చే నెల 1వ తేదీన జరగాల్సిన విజయ సంకల్ప యాత్ర ముగింపు యాత్ర 2వ తేదీకి వాయిదా పడిందని తెలిపారు. మార్చి 2న నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా, చెప్పల్ బజార్, టూరిస్ట్ హోటల్, బర్కత్‌పుర చమన్, ఫీవర్ ఆస్పత్రి, పటేల్ నగర్ చౌరస్తా మీదుగా విజయ సంకల్ప యాత్ర సాగుతుందని తెలిపారు. అంబర్‌పేట శ్రీరమణ టాకీస్ వద్ద సాయంత్రం 6:30 గంటలకు రాష్ట్రంలో జరుగుతున్న అన్ని యాత్రల ముగింపు సభ ఉంటుందని గౌతమ్‌రావు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో సికింద్రాబాద్ తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని మెజార్టీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఈ విజయ సంకల్ప యాత్ర ద్వారా స్పష్టమైందని ఆయన పేర్కొన్నారు.

చిన్నారెడ్డికి అభినందన



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జి.చిన్నారెడ్డిని నియమించడం పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యనాథ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో చిన్నారెడ్డి చేసిన కృషి ఎంతో గొప్పదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయం ముఖ్య పాత్ర పోషిస్తుందని భావించి వ్యవసాయ విద్యను అభ్యసించిన డాక్టర్ చిన్నారెడ్డికి ఈ పదవి ఇవ్వడం శుభపరిణామం అన్నారు. వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, రామచంద్రారావు, మానస తదితరులు పాల్గొన్నారు.

సోనియా, రేవంత్ చిత్రపటాలకు పాలాభిషేకం



సోనియాగాంధీ, రేవంత్‌రెడ్డిల చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేయడానికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నదని నగర మహిళా కాంగ్రెస్ నాయకురాలు గుర్రం చంద్రకళాశంకర్ అన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా గురువారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని అరుధంతీనగర్ బస్తీలో మహిళలతో కలసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, రమేష్, మీనా, లావణ్య, రోజా, సరిత, భాస్కర్‌రెడ్డి, భాగ్యమ్మ, హుస్సేన్‌బీ, భాగ్యమ్మ, హుస్సేన్‌బీ, దినేష్ పాల్గొన్నారు.

మేరు సంఘానికి త్వరలో ఎన్నికలు

హిమాయత్‌నగర్: తెలంగాణ మేరు సంఘానికి త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించుకుని నూతన కమిటీల జాబితాను రాష్ట్ర సంఘం కార్యాలయానికి పంపించాలని సంఘ అడ్‌హక్ కమిటీ కోరింది. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ట్రస్టీ–చైర్మన్ పి.నర్సింగ్‌రావు, ముఖ్య సలహాదారు కె.భాస్కర్‌రావు, అడ్‌హక్ కమిటీ కన్వీనర్ అడపా వెంకటేశ్వర్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్నికలు జరిగాయని, ఇంకా కొన్ని జిల్లాల్లో మాత్రమే జరగాల్సి ఉందన్నారు. మార్చి 31వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆ తరువాత పేర్లు జాబితాను పంపించినా అంగీకరించమన్నారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల నుంచి 9 వేల మంది తమ పేర్ల జాబితాను పంపారన్నారు. మిగిలిన సభ్యులు వెంటనే వాని పేర్లను పంపాలని వారు కోరారు. నాయకులు ఎస్.బి. సంగేశ్వర్, డి.నర్సింగ్‌రావు, కె.వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు ముషీరాబాద్‌లో విజయ సంకల్ప యాత్ర

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు రాంనగర్ చౌరస్తాలో నిర్వహించే భారీ బహిరంగ సభతో ముగిస్తుందని ముషీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ముషీరాబాద్ చౌరస్తా నుంచి కవాడిగూడ ప్రాగా టూల్స్ మీదుగా పద్మశాలీ కాలనీ, అరుంధతినగర్, అశోక్‌నగర్ మీదుగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్, సాగర్ లాల్ ఆస్పత్రి, దాయర మార్కెట్ నుంచి రాంనగర్ చౌరస్తా వరకు జరుగుతుందని తెలిపారు. అనంతరం రాంనగర్ చౌరస్తాలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి, స్థానిక సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్‌లతో పాటు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో యాత్రలో పాల్గొంటారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

‘ట్రస్ట్‌బోర్డులో నిధుల దుర్వినియోగం అవాస్తవం’

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డులో నిధులు దుర్వినియోగం చేసినట్లు కొంత మంది ట్రస్ట్ సభ్యులు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, నిధులు దుర్వినియోగమైనట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు అన్నారు. కాచిగూడలోని ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్ రావు, ఆకుల నాగేష్, ఎలగందల దేవేందర్, అమరం చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల ట్రస్టీ సభ్యులు ఆకుల పాండురంగారావు, మంద సూర్యప్రకాష్, నిమ్మ శంకర్‌లు ట్రస్ట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ట్రస్ట్ బోర్డు పై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ట్రస్ట్‌బోర్డుపై చేసిన ఆరోపణలను వారు రుజువు చేయాలని లేని పక్షంలో విద్యార్థి వసతి గృహంలో వారిని అడుగు పెట్టనివ్వమని హెచ్చరించారు. ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్ణయాల మేరకే కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ట్రస్ట్‌బోర్డుపై చేసిన ఆరోపణలను భేషరతుగా ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారిపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

కచ్చామోరీలో వ్యర్థాల తొలగింపు

కాచిగూడ: వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన స్టేషన్ రోడ్డు కచ్చామోరీ పూర్తిగా నిండిపోయి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే సయస్యను జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం ఆర్ అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్ సిబ్బందిని పిలిపించి కచ్చామోరీలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని బకెట్ మిషన్ ద్వారా శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పనులను స్థానిక బీఆర్ఎస్ నేత దాత్రిక్ నాగేందర్ బాబ్జీ పర్యవేక్షించారు.

ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షులు ఎర్రోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమ కారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షులు రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న, నాయకులు బండి రమేష్, జిల్లా నాగేశ్వర్‌రావు, కరుణా యశ్పాల్, ఉప్పు సుధాకర్, అర్జున్‌రావు, కోశాధికారి రామచందర్‌గౌడ్, యుగేందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

‘మెట్రో జాయ్ రైడ్’లో విద్యార్థులు

ముషీరాబాద్: మెట్రో రైల్వే శాఖ చేపట్టిన మెట్రో జాయ్ రైడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను మెట్రో రైల్లో ఉచితంగా జేబీఎస్ స్టాప్ వరకు తీసుకెళ్లారు. కార్యక్రమాన్ని ఎల్ఎన్‌టీ మెట్రో రైలు ఉన్నతాధికారి మురళి వరదరాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా మెట్రో రైల్లో ప్రయాణించారు. మెట్రోలో ప్రయాణం మంచి అనుభూతిని కలిగించిందని విద్యార్థులు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, స్కూల్ కార్యదర్శి రత్నం పాల్గొన్నారు.

దోపిడీల కేసులో ఆరుగురి అరెస్టు

పంజగుట్ట: చెడు అలవాట్లకు బానిసై, మద్యం మత్తులో దారి దోపిడీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... చాంద్రాయణగుట్ట, ఎల్లమ్మబండ ప్రాంతాలకు చెందిన దుధాని బాధుర్ సింగ్, టేకు నవీన్, గురుదర్ సింగ్ అలియాస్ గురుదేవ్ సింగ్, సయ్యద్ గౌస్ పాషా, షేక్ అల్తాఫ్ అలియాస్ మస్తాన్, మోదేమ్ తుల్జారామ్‌లు స్నేహితులు. వీరంతా చెడు అలవాట్లకు బానిసై త్వరగా డబ్బు సంపాదించేందుకు నేరాలకు పాల్పడుతుంటారు. వీరు ఫిబ్రవరి 25న అందరూ కలిసి డబ్బులు వేసుకుని మద్యం తాగారు. మద్యం తాగిన తర్వాత సయ్యద్ గౌస్ పాషాకు చెందిన ఆటోలో బయలు దేరారు. తెల్లవారు జామున 3:30 ప్రాంతంలో ఎర్రమంజిల్ జీవీకే మాల్ పక్కలైన్ నుండి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి, వెనక ఓ యువతి ద్విచక్ర వాహనంపై వెళ్లడం గమనించారు. అతన్ని అడ్డుకుని అతనిపై దాడిచేసి కత్తిచూపించి డబ్బులు లాక్కునేందుకు, మెడలో బంగారు గొలుసు లాక్కునేందుకు యత్నించారు. అతని ఫోన్ కింద పడిపోగానే నిందితులు ఫోన్ లాక్కుని ఆటోలో పరారయ్యారు. బాధితుడు లంగర్‌హౌస్‌కు చెందిన నరేష్ కుమార్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంజగుట్ట క్రైమ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో బృందం నిందితులను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.



దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాప్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏ-వన్ టీ కంపెనీ 11వ బ్రాంచిని గురువారం నిర్వాహకులు రఫియా పటేల్ ప్రారంభించారు. చిత్రంలో కంపెనీ డైరెక్టర్లు జకి పటేల్, జాకిర్ పటేల్ ఉన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో